సాక్షి
ప్రకాశం
ఆదివారం | 11 | ఆగస్టు | 2024



ఉసురు తీసిన ఈత సరదా

ఈతకొట్టేందుకు చెరువు గుంతలో దిగి ఇద్దరు విద్యార్థులు మృత్యువాతపడిన ఘటన పాములూరులో శనివారం జరిగింది. - 8లో..



ప్రియుడి మోసానికి యువతి బలి

ప్రేమ పేరుతో ఓ యువకుడి చేతిలో వంచనకు గురైన యువతి చివరకు ప్రాణాలొదిలింది. ఈ ఘటన ఒంగోలులో చోటుచేసుకుంది. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

బియ్యం బండి..
ఇంటికి రాదండి..

ఇంటి వద్దే బియ్యం పంపిణీ చేసే వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పలుకుతోంది. దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ఈ విధానం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ పరిపాలనకు గీటురాయి.

ఆ మార్క్ చెరిపేసేందుకు జిల్లాలో లక్షల మంది ప్రజలను కన్నీటి కష్టాలకు గురి చేసేందుకు చంద్రబాబు సిద్ధపడుతున్నాడు. రేషన్ షాపుల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవడం లబ్ధిదారులకు దశాబ్దాల ప్రహసనంగా ఉండేది. వృద్ధులు, దివ్యాంగులు, పేదల రేషన్ కష్టాలు తీర్చేందుకు ఇంటి వద్దకే చేర్చాలనే గొప్ప సంకల్పానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎండీయూ వాహనాలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో లక్షలాది కుటుంబాలకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. ఎండీయూ వాహనాల ద్వారా జీవనోపాధి పొందుతున్న నిరుద్యోగులు రోడ్డున పడనున్నారు.

- ఎండీయూ వాహనాల తొలగింపు
- రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ
- మొదలు కానున్న వృద్ధులు, వికలాంగుల కష్టాలు
- 2019కి 50 నుంచి 60 శాతం రేషన్ పంపిణీ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతానికి పెరిగిన వైనం
- మా పరిస్థితేంటని ఆందోళనలో ఎండీయూ వాహనదారులు
- కూటమి నేతలకు లాభం చేకూర్చేందుకే అనే అనుమానాలు

మాజీ సీఎం జగన్ మార్క్ పాలన చెరిపేసే కుట్ర



రేషన్ వాహనాలు

రేషన్ షాపులు 1392	ఎండీయూ వాహనాలు 385
రేషన్ కార్డులు 6,73,160	వృద్ధులు 1,57,822 మంది
వితంతు మహిళలు 67,981 మంది	దివ్యాంగులు 33,658 మంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వ తీసుకుంటున్న చర్యల పుణ్యమా అని పేదలకు రేషన్ షాపులకెళ్లి సరుకులు తెచ్చుకునే కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. 2019 ముందు రోజులు పునరావృతం కానున్నాయి. ఒక వైపు రేషన్ డీలర్లను బలవంతంగా తొలగించి కూటమి నాయకులకు కట్టబెట్టడం, తాజాగా ఇంటింటి రేషన్ పంపిణీపై ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే రేషన్ సరుకులను దొడ్డిదారిన మళ్లించేందుకు పెద్ద కుట్ర జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన పరిణామాలు ఈ ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు 6,73,160 మంది ఉన్నారు. అందులో 60 ఏళ్ల దాటిన వృద్ధులు 1,57,822 మంది, వితంతు మహిళలు 67,981 మంది, ఒంటరి మహిళలు 7,811 మంది, దివ్యాంగులు 33,658 మంది ఉన్నారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు రేషన్ సరుకుల కోసం దాదాపు రెండు నుంచి మూడు కిలో మీటర్లు నడిచి వెళ్లాలి. అక్కడ గంటల తరబడి లైన్‌లో నిలబడి తీసుకోవాలంటే వారు పడేపాట్లు వర్ణనాతీతం. వితంతు, ఒంటరి మహిళలు అయితే బతుకుతెరువు కోసం కూలినాలి చేసుకుంటుంటారు. వీరంతా రేషన్ సరుకులు కావాలంటే పనులు మానుకోవాల్సిన దుస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఆయా కార్డుదారులకు బియ్యంతో పాటు కిలో కందిపప్పు రూ.67, అర కిలో చక్కెర రూ.17లకు ఇచ్చేవారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.175 నుంచి రూ.185 వరకు పలుకుతుంది. చక్కెర కిలో రూ.48 నుంచి రూ.55 వరకు ఉంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రెండు నెలలుగా కార్డుదారులకు రాయితీపై ఎక్కడా కందిపప్పు, చక్కెర ఇవ్వడం లేదు. బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అడగకుండానే బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, గోధుమపిండి, వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇంతకంటే మిన్నగా పౌరసరఫరాల వ్యవస్థను తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలిచ్చారు. బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, చక్కెర, ఇతర సరుకులు కూడా రాయితీపై అందిస్తామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా ఆ హామీ ఆచరణకు నోచుకోలేదు.

ఎండీయూ వాహనాల ద్వారా ముంగిట్లోకే..

రేషన్ దుకాణాల దాకా వెళ్లలేని సరుకుల కోసం పేదలు పడుతున్న అవస్థలు గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ఎండీయూ వాహనం ద్వారా వెయ్యి నుంచి 2 వేల కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ వాహనాలు ఇంటింటికీ తిరిగి రేషన్ అందిస్తూ వచ్చాయి. ఉదయం ఎనిమిది గంటలకే కుయ్... కుయ్...కుయ్... అంటూ రేషన్ బండి వచ్చిందని ప్రజలకు తెలిసేలా సైరన్‌తో వీధుల్లోకి వెళ్తుంటే నివాసాల్లో కార్డుదారులు తమ ఇంటికి రేషన్ బండి వచ్చిందని గోతాలు తెచ్చుకుని ఇంటి ముందు పంపిణీ చేసిన బియ్యం ఇతర సరుకులు తీసుకుని ఇంట్లోకి రెండు అడుగులు వేసే వారు. ఒక వేళ లబ్ధిదారులు లేకపోతే వారికి మళ్లీ వచ్చి ఇచ్చేవారు. ఇలా పక్కాగా రేషన్ పంపిణీ వ్యవస్థను గత వైఎస్సార్ సీపీ సర్కార్ చేపట్టింది. ఫలితంగా 2019 ముందు తెలుగుదేశం సర్కార్ హయాంలో రేషన్ దుకాణాల్లో 50 శాతం నుంచి 60 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే సరుకులు తీసుకునే వారు. అక్రమాలు ఎక్కువగా జరిగేవి. ఎండీయూ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడం ద్వారా 95 శాతం మంది కార్డుదారులకు సరుకులు తేలిగ్గా లభించాయి. కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పలుకుతుండడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అవస్థలు పడాల్సిందే. వాహనాలు తొలగించడంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు కష్టాలు పునరావృతం కానున్నాయి.

రేషన్ కోసం 2.5 కి.మీ వెళ్లాలి



ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం తొలగిస్తే మా గ్రామంలోని కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడతారు. మా గ్రామం నుంచి గలిజేరుగుళ్లకు రెండున్నర కిలోమీటర్లు వెళ్లాలి. అంతదూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే నరకయాతన అనుభవించాలి. ఇప్పుడు ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తుండటంతో మాకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటోంది.

– రాము, చెన్నుపల్లె, బేస్తవారిపేట మండలం

రేషన్ షాపునకు మూడు కిలోమీటర్లు వెళ్లాలి



మా గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో రేషన్ సరుకుల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాలపాడు గ్రామానికి వెళ్లాలి. జగనన్న ప్రభుత్వంలో రేషన్ వాహనాన్ని పెట్టడం వలన ప్రతి నెలా మా గ్రామానికి వచ్చి నిత్యావసరాలు అందిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం వీటిని తొలగించడంతో పక్క గ్రామంలో ఉన్న రేషన్ షాపునకు వెళ్లాలంటే గ్రామస్తులకు నెల నెలా తిప్పలు తప్పేటట్టు లేదు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలి.

– గోచిపాతల రామయ్య, లింగంగుంట, పొన్నలూరు మండలం

ఆ వాహనాల గతేంటి..?

పేదలకు ఇంటింటికీ రేషన్ సరఫరా చేయాలనే ముఖ్య ఉద్దేశంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలోనే మొట్ట మొదటి సారిగా రేషన్ ఇంటింటికీ అందించేలా ప్రణాళికలు చేపట్టింది. ఇందు కోసం జిల్లాలో 385 రేషన్ వాహనాలు ఏర్పాటు చేసింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా 60 శాతం సబ్సిడీతో వాహనాన్ని సమకూర్చింది. బ్యాంక్‌లో రూ.63 వేలు డిపాజిట్ చేస్తే రూ.5.80 లక్షల విలువైన వాహనం వాహనదారునికి ఇచ్చారు. నెలకు ఈఎంఐ రూ.8700లో రూ.5700 ప్రభుత్వం చెల్లిస్తోంది. మిగిలింది ఆపరేటర్‌కు ప్రతి నెలా ఇచ్చే రూ.21 వేల నుంచి రూ.3 వేలు మినహాయిస్తోంది. మొత్తం 76 వాయిదాలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకూ రూ.3,16,000 చెల్లించారు. ఇంకా 30 వాయిదాలు అంటే రూ.2.64 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఉన్నట్టుండి వాహనాలు నిలిపేస్తే వాయిదాలు ఎలా చెల్లించాలన్న దిగులు వాహనదారుడికి పట్టుకుంది. రేషన్ పంపిణీకి అనుకూలంగా వాహనాలు డిజైన్ చేశారు. అర్ధాంతరంగా వాహనాలు నిలిపేస్తే ఆ వాహనాలు బాడుగలకు పెట్టుకునే పరిస్థితి కూడా లేదు. ఈ వాహనాలు ఏ విధమైన మార్పులు చేయాలన్నా లక్షలతో కూడుకున్న పరిస్థితి. దీంతో మా బతుకులు ఎలా అంటూ వారు మదనపడుతున్నారు.



దాడి కూటమి కుట్రే

- దాడి చేసిన, చేయించిన వారిని కఠినంగా శిక్షించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి: విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం పై దాడి చేయడం చూస్తుంటే కూటమి కుట్రే అని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నల్ల రిబ్బన్‌లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత సేన, దళిత ప్రజా సంఘాల నాయకులు సైతం హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక మహా శిల్పం అనే పేరు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగించి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలనే కక్షకట్టి కుట్ర చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. దళిత ప్రజాసంఘాల నాయకులు గర్నెపూడి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఈ దాడి దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు కొరివి ముసలయ్య, యడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, మేరుగ సుబ్బారెడ్డి, గోళ్ళపాటి మోషె, ఇత్తడి దేవదానం, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్‌సైదా, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మాజీ జేసీఎస్, మండల కన్వీనర్లు మేడికొండ జయంతి, యాదిక శ్రీనివాసరెడ్డి, సూదిదేవర ఆంజయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సౌదాగర్ రహమ్‌తుల్లా, బీ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కే రాంభూపాల్‌రెడ్డి, రాము, శాంసన్, సుబ్బారెడ్డి, విజయ్, వెంకటరెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, టీ బాబురావు, మాజీ ప్రజాప్రతినిధులు కోరే సుబ్బారావు, కే సన్నీ, కే నాగేశ్వరరావు, మజ్జువలి, బీ లక్ష్మీరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పాస్టర్స్ యూనియన్ నాయకులు కృపానందం, ఏసుదాసు, ఏసన్న, నాయకులు కే జాన్, జీ సామ్యేల్, జీ ప్రసన్న, ఎమ్ కిరణ్ బాబు, కుంటా అచ్చారావు, మజ్జువలి, ఎ.రవి, డగ్లస్, బాపిరెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, అప్పిరెడ్డి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆలోచనలతో ముందుకు సాగాలి

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఆయన మనుమడు యశ్వంత్ అంబేడ్కర్



మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్, పక్కన అంబేడ్కర్ మనుమడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్

నాగులుప్పలపాడు: అణగారిన జాతుల కోసం అంబేడ్కర్ సూచించిన బోధించు, సమీకరించు, పోరాడు అనే ఆలోచనలతో యువత ముందుకు సాగాలని అంబేడ్కర్ మనుమడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. నాగులుప్పలపాడు, ఈదుమూడి కూడళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలను శనివారం రాత్రి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అణచివేతల నుంచి పుట్టిన అంబేడ్కర్ ఈరోజు సమాజానికి వెలుగయ్యారన్నారు. ప్రతిఒక్కరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను సమాజంలోని ప్రతిఒక్కరూ తమవాడిగా భావించి ఆయన సిద్ధాంతాల ఆచరణ కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని వృద్ధుడు మృతి

పామూరు: చెట్టుకు ఉరి వేసుకుని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పామూరు మండలంలోని ఇనిమెర్ల గ్రామ సమీపంలో గల కొండప్రాంతంలో శనివారం వెలుగుచూసింది. స్థానిక ఎస్సై తెలిపిన వివరాల మేరకు... శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం వీఆర్ కోట గ్రామానికి చెందిన ముచ్చు మాలకొండయ్య తన ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నాడు. అతని భార్య చనిపోగా, కుమారులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌తో పాటు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు. ఇంట్లో ఒక్కడే ఉండటం, మానసికంగా బాగలేకపోవడంతో నాలుగైదు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. శనివారం ఇనిమెర్ల సమీపంలోని కొండ ప్రాంతంలో పశువుల కాపరులు దుర్వాసన వస్తుండటాన్ని గమనించి వెళ్లిచూడగా, చెట్టుకు టవలుతో ఉరివేసుకుని మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఇటీవల తమ తండ్రి కనిపించడంలేదని ఆయన ఫొటోతో పాటు వివరాలతో నెల్లూరు జిల్లాకు చెందినవారు ఫిర్యాదు చేసి ఉండగా, సెల్‌ఫోన్ ద్వారా వారికి సమాచారం ఇచ్చి ఘటన స్థలానికి తీసుకెళ్లారు. మృతుడు తమ తండ్రి అని వారు గుర్తుపట్టడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి తరలించనున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చర్యలు

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లను గుర్తించలేమనుకుంటే పొరపాటు పడినట్లేనని, మారుపేర్లతో ఫేక్ అకౌంట్లు నిర్వహించేవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సోషల్ మీడియాను యువకులు పాజిటివ్‌గా వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 7వ తేదీ స్వీటీ అనే పేరుతో గిద్దలూరుకు చెందిన ఫేస్‌బుక్ పేజీలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి అనుచిత ఫొటోలు పోస్టు చేసినట్లు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోన చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మార్కాపురం ఎస్డీపీఓ బాలసుందరరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ పర్యవేక్షణలో కంభం సీఐ రామకోటయ్య, ఎస్ఐ పి.రాజేష్ రెండు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గుర్తించి వాట్సాప్ ద్వారా నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ముందుముందు ఇలాంటి పోస్టులు ఎవరు చేసినా చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

ప్రభుత్వ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు ఒక నెల జీతం కట్

ఒంగోలు: ప్రభుత్వ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు ఒక నెల జీతం కట్ చేస్తూ రెన్యువల్ ఉత్తర్వులను పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ జారీచేశారు. వీరికి గత ప్రభుత్వం మే నెలకు సంబంధించి కూడా వేతనాన్ని అందించేది. అందులో భాగంగానే కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను మే నెలలో కూడా విస్తృతంగా ఇంటర్ విద్యాశాఖ వినియోగించుకుంది. కానీ ప్రస్తుతం జారీచేసిన ఉత్తర్వులను పరిశీలిస్తే 2024 జూన్ 1 మొదలు 2025 ఏప్రిల్ వరకు మాత్రమే రెన్యువల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉసురు తీసిన ఈత సరదా

- ఈత కొట్టేందుకు చెరువులోని నీటి గుంతలో దిగి ఇద్దరు బాలురు మృతి
- పామూరు మండల కేంద్రంలో ఘటన
- తీవ్ర విషాదంలో బాలుర కుటుంబాలు
- కన్నీరుమున్నీరైన తోటి విద్యార్థులు

పామూరు:

ఈత సరదా ఇద్దరు విద్యార్థుల ఉసురుతీసింది. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మండల కేంద్రమైన పామూరులోని సీఎస్ పురం రోడ్డులో తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న పాతచెరువులో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న డీవీ పాలేనికి చెందిన పశుపులేటి చరణ్ (17), విరువూరు రోడ్డుకు చెందిన పశుపులేటి గౌతమ్ (15)తో పాటు మరో ఆరుగురు స్నేహితులు రెండో శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఉదయం 11 గంటల సమయంలో సరదాగా ఈత కొట్టేందుకు పాత చెరువు వద్దకు వెళ్లారు. చెరువులోని నీటి గుంతలో ముందుగా పశుపులేటి గౌతమ్ ఈత నేర్చుకునేందుకు దిగాడు. గుంతలోని మట్టి పూడిక లోతుగా ఉండటంతో గౌతమ్ ఇరుక్కుపోయి కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన చూసిన స్నేహితులు కేకలు వేశారు. పశుపులేటి చరణ్‌కు ఈత వచ్చి ఉండటంతో గౌతమ్‌ను కాపాడేందుకు నీటి గుంతలోకి దూకాడు. అప్పటికే ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న గౌతమ్.. ఒక్కసారిగా చరణ్‌ను గట్టిగా పట్టుకోవడంతో చరణ్ కూడా ఈత కొట్టలేకపోయాడు. ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. మిగిలిన ఆరుగురు విద్యార్థులు చూస్తుండగానే నీటి గుంతలో మునిగిపోయారు. దిక్కుతోచని పరిస్థితిలో కేకలు వేసుకుంటూ డీవీ పాలెం వచ్చిన విద్యార్థులు.. చరణ్, గౌతమ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో తమ పిల్లలను కాపాడాలని గగ్గోలుపెడుతూ విలపించారు.



గౌతమ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, అక్కలు, బంధువులు

గజఈతగాళ్లతో వెలికితీత...

నీటి గుంతలో మునిగిపోయిన చరణ్, గౌతమ్‌లను వెలికి తీసేందుకు సీఐ ఎం.రామానాయక్, ఎస్సై ఎం.సైదుబాబు ఆధ్వర్యంలో గజఈతగాళ్లను పిలిపించి గాలి ట్యూబ్‌ల సాయంతో తీవ్రంగా వెతికించారు. నీటి గుంత ఎక్కువ లోతు, పూడికమట్టి ఉండటంతో ఈతగాళ్లు గంటకుపైగా శ్రమించి ఎట్టకేలకు చరణ్, గౌతమ్ మృతదేహాలను వెలికితీశారు. వారిని చూసిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు ఒక్కసారిగా మిన్నంటాయి. అక్కడి నుంచి మృతదేహాలను వారి నివాసాలకు తీసుకెళ్లారు. మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కనిగిరి వైద్యశాలకు తరలించామని ఎస్సై సైదుబాబు తెలిపారు.



చరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి, బంధువులు

కుప్పకూలిన కూలీల కుటుంబాలు...

మృతిచెందిన విద్యార్థి పశుపులేటి చరణ్ తండ్రి నారాయణ చిరు వ్యాపారి. నవారు, ఇతర వస్తువులు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. తల్లి విజయ కూలి పనులు చేస్తూ భర్తకు ఆసరాగా ఉంటుంది. వీరికి చరణ్ పెద్ద కుమారుడు కాగా, మరో కుమారుడు ఉన్నాడు. చరణ్ తనకు సహాయ సహకారాలు అందించడంతో పాటు విద్యలో బాగా రాణిస్తాడని తండ్రి నారాయణ తెలిపారు. పనిమీద వేరే ఊరికిపోయి వస్తుంటే.. చిన్న కుమారుడు వచ్చి ఏడుస్తూ విషయం చెప్పాడని, అలాంటి మాటలు అనకూడదని వారించానని, అంతలోనే మరికొందరు ఘటన స్థలం నుంచి వస్తూ అదేవిషయం చెప్పగా అక్కడికి వెళ్లానని నారాయణ తెలిపాడు. చేతికంది వచ్చిన కుమారుడు మృత్యువాతపడ్డాడంటూ కన్నీరుమున్నీరుగా విలపించాడు. మరో విద్యార్థి పశుపులేటి గౌతమ్ తండ్రి వెంకటేశ్వర్లు పామూరులో వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తుండగా, తల్లి సుజాత గృహిణి. మృతుడు గౌతమ్‌కు ఇద్దరు అక్కలు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత కుమారుడు పుట్టడంతో కంటికి రెప్పలా పెంచుకుంటున్నారు. అక్కలిద్దరూ అపురూపంగా గౌతమ్‌ను చూసుకుంటారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆ కుటుంబం తట్టుకోలేక తల్లడిల్లిపోతోంది. ఇటీవల గౌతమ్ తండ్రి వెంకటేశ్వర్లు కాలికి సర్జరీ జరగడంతో పాటు అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర పేదరికాన్ని అనుభవిస్తోంది. ఈ సమయంలో కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు మృత్యువాతపడి ఆ కుటుంబానికి తీరని వేదన మిగిల్చాడు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం...

మృతిచెందిన గౌతమ్, చరణ్ ఇద్దరూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుండటంతో పాటు మంచి స్నేహితులు. ఈత నేర్చుకునేందుకు గుంతలో దూకిన గౌతమ్ ఇరుక్కుపోయి కొట్టుమిట్టాడుతుండటాన్ని చూసి తట్టుకోలేకపోయిన చరణ్.. తనకు ఈత వచ్చి ఉండటంతో కాపాడేందుకు ఒక్కసారిగా నీటిలోకి దూకాడు. ప్రాణభయంతో చరణ్‌ను గౌతమ్ గట్టిగా పట్టుకోవడంతో స్నేహితులిద్దరూ ఒకేసారి మునిగిపోయి ప్రాణాలు వదిలారు. మృత్యువులోనూ కలిసే ఉంటామంటూ వారి స్నేహబంధం గొప్పతనాన్ని నిరూపించారు.

లే అవుట్లకు మట్టి తవ్వడం వలనే గుంతలు అంటూ ప్రజల మండిపాటు...



పామూరు పాతచెరువులోని నీటిగుంతలో విద్యార్థుల కోసం గాలిస్తున్న గజఈతగాళ్లు

పామూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వేసిన లే అవుట్లకు చెరువులో అక్రమంగా రాత్రివేళల్లో మట్టి తవ్వి తరలించడం వలనే పెద్ద పెద్ద గుంతలు పడి ఇలా జరిగిందని పామూరు ప్రజలు మండిపడుతున్నారు. వర్షం కురిసినప్పుడు లోతైన గుంతలన్నీ నీటితో నిండటంతో పాటు సమీపంలోని మట్టితో బురద ఏర్పడి ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లే అవుట్‌దారులే విద్యార్థుల మృతికి కారణమని ఆరోపిస్తున్నారు.



గౌతమ్ (ఫైల్)



చరణ్ (ఫైల్)



మృతుడు పశుపులేటి గౌతమ్



మృతుడు పశుపులేటి చరణ్

ప్రియుడి మోసానికి యువతి బలి

- తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న యువతి
- ప్రేమ పేరుతో నమ్మించి గర్భిణిని చేసిన ప్రేమికుడు
- అనారోగ్యం కారణంగా పరిస్థితి విషమించడంతో ఒంగోలు జీజీహెచ్‌లో అడ్మిట్ చేసి పరార్
- ఆస్పత్రిలో యువతి మృతి



మృతిచెందిన చప్పిడి ప్రియ (ఫైల్)



మార్చురీలో ప్రియ మృతదేహం

ఒంగోలు టౌన్: ప్రేమ పేరుతో ఓ యువకుడి చేతిలో వంచనకు గురైన యువతి చివరకు ప్రాణాలొదిలింది. పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించడంతో పాటు శారీరకంగా దగ్గరై యువతిని గర్భిణిని చేశాడు. ఆ యువతి ఆరోగ్యం క్షీణించడంతో ఒంగోలు జీజీహెచ్‌లో అడ్మిట్ చేసి పరారయ్యాడు. చికిత్స పొందుతూ యువతి మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు రాజీవ్‌కాలనీకి చెందిన చప్పిడి రాజేంద్రప్రసాద్, అరుణకుమారి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులిద్దరూ పనిచేస్తున్నారు. తండ్రి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, తల్లి కూలి పనులకు వెళ్లి పిల్లలను చదివించుకుంటోంది. పెద్ద కూతురు ప్రియ తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. మిగతా ఇద్దరు కూతుళ్లు చీమకుర్తిలో పదో తరగతి చదువుకుంటున్నారు. ప్రియ కూడా 3వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చీమకుర్తి గురుకుల పాఠశాలలో చదివింది. తన క్లాస్‌మేట్, దూరపు బంధువైన శివకళ్యాణ్‌తో ఏడాది క్రితం ఆమెకు పరిచయమైంది. సంతనూతలపాడు మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన శివకళ్యాణ్ పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. వారి పరిచయం ప్రేమగా మారింది. ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ చదువుకుంటున్న ప్రియ.. తన తల్లిదండ్రులకు తెలియకుండా తక్కెళ్లపాడు వచ్చి తరచూ ప్రియుడితో కలుస్తుండేది. ఈ క్రమంలో శారీరకంగా కూడా దగ్గరైంది. దీంతో ఆమె గర్భం దాల్చింది. ఈ విషయాన్ని ప్రియుడు శివకళ్యాణ్‌కు చెప్పింది. జూలై చివరి వారంలో యూనివర్సిటీ నుంచి వచ్చేసి తక్కెళ్లపాడులో ప్రియుడితో కలిసి జీవిస్తోంది. శుక్రవారం రాత్రి ప్రియ ఆరోగ్యం దెబ్బతింది. ఎగశ్వాస వస్తుండటంతో ఆమెను ఒంగోలులోని జీజీహెచ్‌కి శివకళ్యాణ్ తీసుకొచ్చాడు. హాస్పిటల్‌లో చేర్పించి ప్రియ తండ్రి రాజేంద్ర ప్రసాద్‌కు గుర్తు తెలియని వ్యక్తిలా ఫోన్ చేశాడు. తిరుపతి నుంచి రైలులో వస్తుండగా మీ అమ్మాయికి ఫిట్స్ వచ్చాయని, ఆమెను ఒంగోలు జీజీహెచ్‌లో జాయిన్ చేశానని చెప్పాడు. ఆందోళనకు గురైన రాజేంద్రప్రసాద్ హడావిడిగా జీజీహెచ్‌కి వచ్చాడు. ఆస్పత్రిలో వాకబు చేయగా, మీ కూతురు ఆరో నెల గర్భిణి అని, ఆమె చనిపోయిందని వైద్యులు చెప్పారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతనూతలపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో ప్రియ ప్రియుడు శివకళ్యాణ్ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

నా బిడ్డను చంపిన హంతకులను శిక్షించండి సారూ...

నా బిడ్డతో రెండు రోజుల క్రితమే మాట్లాడాను. బాగానే మాట్లాడింది. కాస్త దగ్గు వస్తుందని చెప్పింది. ఇంతలో ఇలా చనిపోతుందని అనుకోలేదంటూ ప్రియ తల్లి అరుణకుమారి గుండెలవిసేలా రోదిస్తోంది. తన బిడ్డను మోసం చేసి ఆమె చావుకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని, తన బిడ్డలాగా మరొకరి బిడ్డ బలికాకూడదని కన్నీరు పెట్టింది. ప్రియ కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరుతున్నారు. ప్రియ నోటి నుంచి నురగ వస్తుండటంతో ఆమె మరణం సహజ మరణం కాదన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమెపై హత్యా ప్రయత్నం జరిగి ఉండవచ్చని బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తిగా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

58 కేసుల మద్యం ధ్వంసం

దర్శి: దర్శి సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు పట్టుబడిన 58 కేసుల మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. దర్శి, దొనకొండ మండలాలకు చెందిన వివిధ కేసుల్లో ఆరు నెలలుగా పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పగులగొట్టి అందులో ఉన్న మద్యం పారబోసినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా దర్శి మండలంలో 31, దొనకొండ మండలంలో 27 మద్యం కేసులు పట్టుబడినట్లు తెలిపారు. వాటిలో మద్యంతో పాటు బీర్లు కూడా ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా గంజాయి వంటి హానికరమైన మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని రవికుమార్ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అక్రమంగా మద్యం అమ్మడం, బెల్ట్ షాపులు నిర్వహించడం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, సంపత్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాటిళ్లను పగలగొట్టి మద్యాన్ని కింద పోయిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఒంగోలులో చోరీ

- 48 సవర్ల బంగారు నగలు, రూ.1.80 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ జగదీష్

ఒంగోలు టౌన్: నగర శివారులో దొంగలు పడి చేతికందినకాడికి ఎత్తుకెళ్లారు. ఒక కుటుంబం వివాహానికి వెళ్లి కొన్ని గంటల వ్యవధిలోనే తిరిగి రాగా, అంతలోనే దొంగలు పడటం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక ఇందుర్తినగర్ చివర్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి గుమ్మడి నాగార్జునరావు భార్యతో కలిసి జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి బంధువుల ఇంట్లో వివాహం ఉండటంతో 8.30 గంటలకు వివాహానికి బయలుదేరారు. తిరిగి అర్ధరాత్రి 2 గంటలకు ఇంటికొచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా పగులగొట్టి ఉంది. అందులోని 48 సవర్ల బంగారు నగలు, రూ.1.80 లక్షల నగదు దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ జగదీష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

- రూ.1.30 లక్షల నగదు, రూ.2.5 లక్షల విలువైన గోల్డ్ చెయిన్ అపహరణ



దుకాణంలో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

పొదిలి: స్థానిక విశ్వనాథపురంలో జూనియర్ కళాశాల రోడ్డులోని కిరాణా దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రూ.1.30 లక్షల నగదు, సుమారు రూ.2.5 లక్షల విలువైన గోల్డ్ చెయిన్‌ను దొంగలు అపహరించారు. దుకాణ యజమాని గొంట్లా లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో దుకాణం మూసివేసి వెళ్లారు. శనివారం ఉదయం దుకాణం తెరిచి చూసే సరికి క్యాష్ టేబుల్ సొరుగు బయటకు లాగి ఉంది. పద్దుల పుస్తకాలు, సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దుకాణం వెనుకవైపు తలుపు ఘడియ పగులగొట్టి ఉంది. దీంతో దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రెండు పెండ్లి కార్యక్రమాలకు సంబంధించిన సరుకుల తాలూకా వచ్చిన నగదు, వేరే వారు కొంత నగదు ఇవ్వగా ఆ మొత్తం కలిపి రూ.1.30 లక్షలు, మరమ్మతుల కోసం తీసుకెళ్దామని ఇంటి నుంచి తెచ్చి సొరుగులోనే ఉంచిన మూడున్నర సవర్ల సుమారు రూ.2.5 లక్షల విలువ గల బంగారు చెయిన్‌ను దొంగలు అపహరించినట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసులకు లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేయగా, క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.